నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 19 మార్చి 2025 | HYDERABAD

## ఓటీఎస్‌కు స్పందన కరువు

### రూ.300కోట్ల లక్ష్యం.. వచ్చింది రూ. 22 కోట్లు మాత్రమే

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)కు స్పందన కరువైంది. ఈ నెల 7న సర్కార్ ఆస్తిపన్ను బకాయిదారులు సంబంధిత బకాయి ఒకేసారి చెల్లించి 90 శాతం వడ్డీ రాయితీ పొందాలని ఓటీఎస్‌కు అవకాశం కల్పించింది. భారీ ఎత్తున ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. గడిచిన 11 రోజులుగా ఓటీఎస్‌కు కేవలం రూ. 22 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. కాగా గత రెండేళ్లలో ఓటీఎస్‌ను పరిశీలిస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో వన్‌టైమ్ స్కీం ద్వారా 59838 మంది సద్వినియోగం చేసుకోగా రూ.170కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. 2023-24 సంవత్సరంలో 108091 మంది సద్వినియోగం చేసుకొని రూ. 320 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకున్నది. ఈ సారి కూడా రూ. 300 కోట్ల లక్ష్యాన్ని ఖరారు చేసుకోగా నిర్దేశిత టార్గెట్‌ను అధిగమించడం కష్ట సాధ్యమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం నాటి వరకు 13 లక్షల మంది నుంచి రూ. 1600 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది.


పూర్తి స్థాయి ఎండాకాలం రాకముందే మార్చి నెలలోనే పూర్తిగా ఎండిపోయి వట్టిపోయిన పబ్లిక్ గార్డెన్ చెరువు


కూకట్ పల్లిలోని హస్మత్‌పేటలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

# పేదలపై పన్ను పోటు!

## జీహెచ్ఎంసీతో పాటు శివారులోనూ అప్రకటిత ఆస్తిపన్ను వసూళ్లు


- బల్దియా పెరుగుతున్న పన్ను వ్యత్యాసం
- శివారు మున్సిపల్ కార్పొరేషన్లలో రెట్టింపు పన్నుల భారం
- ఇంటిపన్ను తగ్గింపుపై పోరుబాట పట్టిన కాలనీలు
- వందలాది కాలనీలు కలిసి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు
- సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన ఓల్డ్ బోయిన్‌పల్లి బాధితుడు

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్‌పేటలో సీహెచ్ ప్రసాద్ రావు తన ఇంట్లో 40 ఏండ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. పీటీఐఎన్ నంబరు 1140900341 కలిగిన తన ఇంటికి ఏటా రూ.1100లు ఆస్తిపన్ను చెల్లించేవారు. 2017 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వం ఆస్తి పన్ను రూ.1200లోపు ఉన్న భవనాలకు ఏటా రూ.101లు పన్ను చెల్లిస్తే సరిపోతుందని ప్రత్యేక రాయితీ పథకాన్ని తీసుకువస్తూ జీవో జారీ చేశారు. ఈ పథకం కింద లబ్ధిపొందుతూ వచ్చిన ప్రసాద్ రావుకు ఒక్కసారిగా ఏటా రూ.10,608ల చొప్పున ట్యాక్స్ వేసి నాలుగేళ్ల ట్యాక్స్ ఒకేసారి రూ. 43,267లు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. ఇదేక్కటి అన్యాయమని డిప్యూటీ కమిషనర్లను, టీఐ (ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల)ను అడిగిన ఫలితం లేదు. సదరు ప్రసాదరావు సమగ్ర వివరాలతో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.. ఇప్పటికి ప్రసాద రావు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు..ఒక్క ప్రసాద్ రావుకే కాదు.. చాలా మంది రూ.101 రాయితీ లబ్ధిదారులు ప్రతి శనివారం జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న ప్రాపర్టీ పరిష్కార వేదికలకు క్యూ కడుతున్నారు.

సైదాబాద్ కుర్మగూడలోని ఏళ్ల నాటి ఇల్లు అది.. ఇంటి నంబరు 17-2-427, 428, పీటీఎన్ నంబరు 1041705840 కలిగిన ఆ రెండంతస్తుల ఇంటికి గతంలో ఆస్తిపన్ను రూ.3వేలుగా ఉండేది.. యాజమానికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఆస్తిపన్నును సవరించింది. అప్పటికే ఆస్తిపన్ను చెల్లించిన సదరు యాజమానికి నాలుగు రెట్ల బిల్లు రావడంతో ఖంగుతిన్నాడు.

### శివారు మున్సిపాలిటీల్లో..

జీహెచ్ఎంసీని అనుకుని ఉన్న శివారు మున్సిపాలిటీలలో ఇంటి పన్ను బాధితులు పెరిగిపోతున్నారు. మీర్‌పేట, బోడుప్పల్, ఫీర్జాదిగూడ తదితర మున్సిపాలిటీలలో ఇంటి పన్నుపై ఫిర్యాదుదారులు ఏకంగా రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. మీర్‌పేట మున్సిపాలిటీలలో పలువురి కాలనీలు కలిసి ఏకంగా 'ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్స్' ఏర్పాటు చేసి ఇంటిపన్ను తగ్గింపునకు పోరు బాట పట్టారు. ఏకంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పన్నుల భారం తగ్గించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. నిర్మాణ ప్రాంతంతో పాటు నిర్మించిన ఇంటి స్థలం విలువపై కూడా అదనంగా పన్ను వేస్తుండటమే ఈ నిరసనకు ప్రధాన కారణం. నిర్మించిన ఇంటితో పాటు నిర్మాణమైన




స్థలానికి సంబంధించిన రెండు పన్నులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందంటూ ఇక్కడి కాలనీ వాసులు వాపోతున్నారు. ఉదాహరణకు 100 గజాలలో జీ 2తో సుమారు 2500 ఎస్ఎఫ్‌టీలో ఇంటి నిర్మాణం జరిగితే, 2500 ఎస్ఎఫ్‌టీకి పన్ను విధిస్తుంటారు, నివాసాలకు సుమారు .25 పైసలు, కమర్షియల్ .35పైసల మేర పన్నులు విధిస్తున్నారు. ఇంత వరకు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జరుగుతున్న పన్ను వసూలు విధానం. అయితే ఇళ్లు నిర్మించిన వంద గజాల స్థలానికి గవర్నమెంట్ వాల్యూ రూ.12500 అనుకుంటే దానిపై కూడా .25పైసల మేర పన్ను చెల్లించాల్సి వస్తోందంటూ మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డిల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఖజానా నింపుకోవడమే లక్ష్యం..

జీహెచ్ఎంసీ, శివారు అని తేడా లేకుండా సామాన్యుల నుంచి ఇష్టానుసారంగా పన్నులు వసూలు చేసి ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు పనిచేస్తున్నారు. పేదలపై 'పన్ను' పోటు వేస్తూ వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. జీహెచ్ఎంసీలో అప్రకటిత భారం మోపుతుండగా, ఫీర్జాదిగూడ, మీర్‌పేట, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పన్ను వసూళ్లలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమను బతకనిచ్చే పరిస్థితి లేదంటూ శివారు మున్సిపాలిటీలలోని కాలనీలు, బస్తీల ప్రజలు ఏకమవుతూ ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమయ్యారు. మరికొందరు న్యాయపోరాటాలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ చీకటి పన్నుకు తెరలేపిన మీర్‌పేట మున్సిపల్ అధికారుల తీరును ఎండగట్టేందుకు వందలాది కాలనీలకు చెందిన ప్రజలు ఒక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీల నాయకులను కూడా భాగస్వామ్యం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధం కావడం గమనార్హం. మీర్‌పేట్ కార్పొరేషన్ అధికారులు మాత్రం తాము ఒక్కరమే ఇలా చేయడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు మున్సిపాలిటీలలో ఇలాంటి పన్ను వసూలు జరుగుతుందని (మిగతా IVవ పేజీలో)

## అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్**


ఓల్డ్ బోయినపల్లి డివిజన్ వల్లభనగర్‌లో స్కూల్ వ్యాన్, క్యాబ్ డ్రైవర్ల సంక్షేమ సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం

బాలానగర్, మార్చి 18 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పల్లి వల్లభ నగర్‌లో తెలంగాణ స్కూల్ వ్యాన్, క్యాబ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు ఓల్డ్ బోయిన్‌పల్లి బీఆర్ఎస్ శ్రేణులు, వ్యాన్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం హస్మత్ పేట బడి మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మైనార్టీలకు పండ్లు అందజేసి ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాలు అయోమయానికి గురవుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని ప్రజలు ఆరోపిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌తో (మిగతా IVవ పేజీలో)

## నాకు తెల్వకుండా శంకుస్థాపనలా?

**దానం నాగేందర్**



హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): తన క్యాంపు కార్యాలయం కోసం స్థలం కావాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. తన విజ్ఞప్తిని పట్టించుకోకుండా ఈద్గా గ్రౌండ్‌లో తనకు తెలియకుండా, తనను పిలువకుండా సబ్‌స్టేషన్ కోసం శంకుస్థాపన శిలాఫలకం వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం అసెంబ్లీ వేదికగా దానం నాగేందర్ మండిపడ్డారు. తాను చెప్పిన అంశాలను మంత్రి నోట్ చేసుకోవడం కాదని, గుర్తుపెట్టుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ కాలనీలో అక్రమంగా ఆరు అంతస్థుల భవనాలు నిర్మించారని, దానిని కూలగొట్టాలని జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

### మూసారాం వంతెన పూర్తిచేయండి: కాలేరు



హైదరాబాద్ అంబర్‌పేటలో చే నంబర్ చౌరస్తాలో రూ.400 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించి వాహనాల రాకపోకలు అనుమతి ఇచ్చారని, కానీ సర్వీసు రోడ్లు పూర్తవపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు.మూసారాం బ్రిడ్జి నిర్మాణం నత్తనడక సాగుతున్నదని, రెండేండ్లు కావస్తున్నా 30 శాతం పనులు కూడా కాలేదని వాపోయారు. యుద్ధప్రాతిపదికన బ్రిడ్జిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, యశస్వినీరెడ్డి, మట్టా రాగమయి, కూచుకుళ్ల రాకేశ్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కల్వంపల్లి సత్యనారాయణ, రామారావు పవార్, కోవా లక్ష్మి, చిట్టెం పర్ణితారెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, జల్‌పల్లి రంగారెడ్డి తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

# అంధకారంలో ఆశల జీవితాలు

### బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక భరోసా

- కాంగ్రెస్ పాలనలో వెట్టిచాకిరి
- సర్వేలు చేసిన డబ్బులు ఇస్తలేరు
- కేసీఆర్ కిట్ లేక తగ్గిన డెలివరీలు
- పనిభారంతో అనారోగ్య సమస్యలు

సిటీబ్యూరో, మార్చి18 (నమస్తే తెలంగాణ): నిత్యం పేద ప్రజల ఆరోగ్యాలను పర్యవేక్షిస్తున్న ఆశవర్కర్ల జీవితాలు అంధకారంలోకి చేరాయి. అధికారంలోకి రాగానే ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేస్తుంది. హైదరాబాద్‌లో ఉన్న సుమారు 1650 మంది ఆశవర్కర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ ఆరోగ్య పరిరక్షణకు పాటు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పలు ఆరోగ్య సర్వేలు చేస్తున్నారు. ఎన్‌సీడీ, క్షయ, ఫైలేరియా, ఫీవర్ వంటి సర్వేల్లో పాల్గొంటు టార్గెట్లను అధిగమించి పనిచేస్తున్నారు. ఈ సర్వేలకు గాను ప్రభుత్వం పారితోషికం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు సర్వేలు ఎన్ని చేసినా ఆశలకు డబ్బులు ఇవ్వని పరిస్థితి నెలకొంది. సర్వేలతోపాటు సెంటర్లలో విధులు నిర్వహించే వాళ్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటుంది. మరోవైపు జిల్లాలో 128 ఏఎన్ఎం పోస్టులు ఖాళీలు ఉండటంతో సిబ్బంది కొరత ఉన్న సెంటర్లలో ఏఎన్ఎంలు చేయాల్సిన ఎంసీహెచ్, ఎన్‌సీడీ వివరాలు ఆన్‌లైన్ ఎక్కించే పనిని కూడా ఆశలే చేస్తుండటం గమనార్హం. పనిభారంతో అనారోగ్య సమస్యలకు గురవుతూ, ఉద్యోగాలు వదిలే పరిస్థితి నెలకొంది.

### తగ్గిన డెలివరీ నమోదులు..

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ వల్ల అనేక మంది పేదలు ప్రసవాల కోసం ప్రభుత్వ దవాఖానల్లో చేరేవారు. ఆశ వర్కర్లతో వారి పేరు నమోదు చేయించుకునేవారు. డెలివరీ సమయంలో కూడా పేరు నమోదు చేసుకొని వారికి కేసీఆర్ కిట్ అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేసీఆర్ కిట్‌కు బదులు ఎంసీహెచ్ కిట్ గా పేరు మార్చి ఇవ్వడమే మానేసింది. దీంతో గర్భిణులు ఆశవర్కర్ల వద్దకు రావడమే మానేశారు. అధికారులు (మిగతా IVవ పేజీలో)

### గుర్తింపు ఇస్తలేరు



బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నాటి వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్షలు నిర్వహించి మా సాధకబాధకాలు తెలుసుకునేవారు. ప్రస్తుతం ఆపత్రులకు వెళ్తే కనీస గుర్తింపు ఇవ్వకుండా చూస్తున్నారు.

**- రావుల సంతోష, బీఆర్‌టీయూ సంఘం ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు**

### హామీలు మరిచారు



హైదరాబాద్ జిల్లాలో పనిచేసే ఆశలపై అధిక పనిభారం పడుతుంది. సర్వేలు చేయించుకుంటున్నారు డబ్బులు ఇవ్వడం లేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే ప్రభుత్వం విస్మరించింది. మా సొంత డబ్బులతో పలుసార్లు ఆసుత్రులకు పేషెంట్లను తీసుకెళ్తున్నాం.

**- యాదమ్మ, సీఐటీయూ సంఘం ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు**


ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్ ను తక్షణమే వెనక్కి తీసుకోవాల్సిందేనని విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. పలువురు పూర్వ విద్యార్థులు, న్యాయవాదులు, జర్నలిస్టులు విద్యార్థి నాయకులకు సంఘీభావం తెలిపి వారితో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఉద్యమాల గడ్డమీద ఆందోళనలు చేయకూడదనడం అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. సర్క్యులర్ కు వ్యతిరేకంగా ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

## బెట్టింగ్ కట్టడిలో అలసత్వం

- బీఆర్ఎస్ హయాంలో ఉక్కుపాదం
- కాంగ్రెస్ పాలనలో జోరుగా ఆన్‌లైన్ గేమ్స్
- యువతను ఆకర్షిస్తున్న బెట్టింగ్ మాఫియా
- ఆన్‌లైన్‌లో ఉండేవారే టార్గెట్
- నష్టాలతో బలవన్మరణాలు

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆటలు ఆడుతూ యువకులు తమ ప్రాణాలు కోల్పోతున్నారు.. యువతను ఆన్‌లైన్ గేమ్స్‌లోకి ఆకర్షించేందుకు బెట్టింగ్ మాఫియా సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ ప్రభావం ఉన్నా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా అలసత్వం వహిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ మన రాష్ట్రంలో ఉండకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వం బెట్టింగ్ రాయుళ్లపై ఉక్కుపాదం మోపింది. కేసులు నమోదు చేసింది. అయితే గత ఏడాది కాలంలోనే రాష్ట్రంలో పరిస్థితి చిన్నాభిన్నంగా మారింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ పెరిగిపోయింది, ఆన్‌లైన్ గ్యాంబ్లర్స్‌పై పోలీసులు పట్టించుకోక పోవడంతో బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగించేందుకు ఇన్‌ఫ్లూయెన్సర్‌ను వాడుకోవడం మొదలు పెట్టారు. యాప్‌ల నుంచి వచ్చే ఆదాయం భారీగా ఉండటంతో ఇనుఫ్లూయెన్సర్స్ సైతం అమాయకులను బెట్టింగ్ రొంపిలోకి దింపుతూ కష్టాల్లో నెడుతూ, కొందరు బలవన్మరణాలకు పాల్పడిన ఘటనలకు పరోక్షంగా కారకులయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్‌ఫ్లూయెన్సర్స్ కూడా దానిని ప్రమోట్ చేస్తుండటంతో వేలాది మంది యువత బెట్టింగ్ వైపు ఆకర్షితులయ్యారు. యువత తమ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల ఖాతాలకు తగేలేస్తున్నారు.

### ఆటలను నిషేధిస్తూ చట్టం..

2017లో తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటలను నిషేధిస్తూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. (మిగతా IVవ పేజీలో)

# నిమ్స్ సెక్యూరిటీకి జీతాలేవి?

### ఏజెన్సీలే ఆలస్యం చేస్తున్నాయి.. -డాక్టర్ బీరప్ప, డైరెక్టర్ నిమ్స్ హాస్పిటల్

"నిమ్స్ సెక్యూరిటీ గార్డుల సమస్య మా దృష్టికి వచ్చింది. ఏజెన్సీ గురించి కూడా పూర్తి సమాచారం ఉంది. కాంట్రాక్ట్ ఏజెన్సీ సకాలంలో బిల్లులు పెట్టడం లేదు. గతంలోనూ ఆలస్యం చేయడం వల్లే వారి వేతనాల చెల్లింపులో ఆలస్యమైంది. నిమ్స్ ఆస్పత్రి తరపున ఎలాంటి సమస్య లేదు. ఏజెన్సీ వారే పీఎఫ్ లెక్కలతో కూడిన బిల్లులు అందించకపోవడం వల్లే ఈ సమస్య ఎదురవుతున్నది. వారి వేతనాలు సకాలంలో చెల్లించేలా చొరవ తీసుకుంటాం.


నిమ్స్‌లో నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ గార్డులు

### రూ.3కోట్లు గోల్‌మాల్ చేసిన ఏజెన్సీకి సెక్యూరిటీ బాధ్యతలు..!

ఖైరతాబాద్, మార్చి 18 : నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది జీవితాలకు భద్రత కరువైంది. నిత్యం వేలాది మంది రోగులు, వారి సహాయకులతో పాటు డైరెక్టర్ మొదలు వార్డు బాయ్‌ల వరకు అందరికీ రక్షణగా నిలిచే సెక్యూరిటీ గార్డుల పరిస్థితి దయనీయంగా మారింది. 24/7 గంటలు ఆస్పత్రి భద్రతను పర్యవేక్షించే సెక్యూరిటీ గార్డులను మాత్రం పట్టించుకునే వారే కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిమ్స్ దవాఖానలో సెక్యూరిటీ గార్డుల వేతనాల వెతలు కొత్తవి కాదు. ఏజెన్సీలు ఎన్ని మారినా రెండు నెలలకు, మూడు నెలలకోసారి వేతనాలు అందించడం పరిపాటిగా మారిపోయింది. గతంలో ఓ ఏజెన్సీ నిమ్స్ సెక్యూరిటీ గార్డులకు చెల్లించాల్సిన లక్షలాది రూపాయల పీఎఫ్ డబ్బులను దిగమింగింది. కానీ ఇప్పటి వరకు యాజమాన్యం ఎలాంటి విచారణకు ఆదేశించకపోగా, మళ్లీ అలాంటి సంస్థలకే బాధ్యతలు ఇస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ఏజెన్సీలు మారినా.. వేతనాలు సరిగా చెల్లించకుండా మోసగించే ఏజెన్సీలకే పదే పదే బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు సెక్యూరిటీ గార్డులు వాపోతున్నారు. ప్రస్తుతం కార్తికేయ, ఓపీడీఎస్ఎస్ (ఓం సాయి ప్రొఫెషనల్ డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్) సంస్థలు నిమ్స్ సెక్యూరిటీ బాధ్యతలను చూసుకుంటున్నాయి. కాగా, మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తాత్సారం చేస్తూ సెక్యూరిటీ గార్డుల విధుల బహిష్కరణ, నిరసనకు కారణమైన సంస్థ మాత్రం గతంలో సుమారు మూడు కోట్ల పీఎఫ్ డబ్బుల గోల్‌మాల్‌కు పాల్పడిందన్న ఆరోపణలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆ సంస్థకు ఈ విషయంపై కార్మిక శాఖ నుంచి నోటీసులు సైతం అందినట్లు సమాచారం. మంగళవారం మరో సారి విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.

## వేతనం కావాలంటే రోడ్డెక్కాల్సిందేనా!

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు**

ఖైరతాబాద్, మార్చి 18 : నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా, వారిని రోడ్డెక్కే దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. వేతనాల కోసం నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం ఆసుపత్రిలో విధులు బహిష్కరించి నిరసన తెలుపడం పై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఎంతో అంకిత భావంతో ఆస్పత్రికి రాత్రింభవళ్లు సేవలు అందిస్తున్న సిబ్బంది ప్రతి నెల జీతాలు కోసం చేతులు జోడించి అడగాల్సి వస్తున్నదన్నారు. రోడ్డెక్కి పోరాటం చేస్తేతప్ప వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రతినెల మా జీతం మాకు ఇవ్వండి" అని ఉద్యోగులు రోడ్డెక్కి మొరపెట్టుకోవాల్సి రావడం శోచనీయమన్నారు. నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.